సాక్షి గుంటూరు

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



ఈవీఎం గోడౌన్ పరిశీలన

లక్ష్మీపురం: గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని గోడౌన్ భద్రపర్చిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.



అమ్మవారి హుండీ లెక్కింపు

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో కానుకల హుండీ లెక్కించగా నాలుగు నెలలకు రూ.8,30,922 ఆదాయం వచ్చినట్లు అధికారులు గురువారం తెలిపారు.

నేడు కోటి పడగల పుణ్యక్షేత్రం మహోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురంలోని కోటి పడగల పుణ్యక్షేత్రమైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం షష్టి పూర్తి వార్షిక మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకటరత్నం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సాగర్‌ను సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు



విజయపురిసౌత్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను బుధవారం 23 దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధులు సందర్శించారు. నేపాల్, శ్రీలంక, రష్యా, వియత్నాం, జింబాబ్వే, నైజీరియా, తదితర 23 దేశాల ప్రతినిధులు ఈ నెల 15వ తేదీ నుంచి హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'నూతన ఆవిష్కరణలు–అభివృద్ధి' అనే అంశంపై శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 30వ తేదీతో శిక్షణ ముగియనుంది. దీనిలో భాగంగా టీం కో–ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌ను సందర్శించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జున కొండ చారిత్రక విశేషాలను, నాగార్జున సాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరి వెంట తెలంగాణ అధికారులు ఎస్‌పీఎఫ్ ఎస్‌ఐ రఘు, తదితరులు ఉన్నారు.

నేడు జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఈనెల 29న జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైకల్య నిర్ధారణ పరీక్షల నిమిత్తం జీజీహెచ్ మెడికల్ బోర్డుకు రూ.1500 చెల్లించాలని సూచించారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఏఎన్‌ఎంల నిరసన



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆరు మాసాల కిందట జరిగిన మొదటి జాబితాలో ఉద్యోగోన్నతి రావాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యం అయ్యిందని ఏఎన్‌ఎంలు వాపోయారు. గురువారం ఉదయం కూడా కౌన్సెలింగ్ నిర్వహించకుండా తరువాత నిర్వహిస్తామని చెబుతున్నారని పేర్కొంటూ మాకు న్యాయం చేయాలంటూ ఏఎన్‌ఎంలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రెండో ఉద్యోగోన్నతి జాబితా సిద్ధం చేసి దాని ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు.

పశ్చిమ డెల్టాకు 5,007 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 5,007 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు138, బ్యాంక్ కెనాల్ 1,241, తూర్పు కాలువకు 547, పశ్చిమ కాలువకు 229, నిజాపట్నం కాలువకు 428, కొమ్మూరు కాలువకు 1,760 క్యూసెక్కులు విడుదల చేశారు. 4,16,622 క్యూసెక్కులు సముద్రంలోకి పంపుతున్నారు.

30న ఉద్యోగ మేళా

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు గురువారం తెలిపారు. లక్ష్మీపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద గల పాంటలూన్స్–షోరూమ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్ మేళాకు ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చేసిన 18–35 ఏళ్ల మధ్య వయసు గల వారు హాజరు కావచ్చని చెప్పారు. బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు అట్ల రామకృష్ణారెడ్డిని 77319 82861 ఫోను నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

మెరిట్ లేని డీఎస్సీ!

కాల్ లెటర్ వస్తేనే ఉద్యోగమంటూ కూటమి సర్కార్ మెలిక

- మెరిట్ కం రోస్టర్ జాబితా ప్రకటించకుండానే కాల్ లెటర్లు
- అర్హులైన జాబితా ప్రకటించే విధానానికి మంగళం పలికిన విద్యాశాఖ
- గుంటూరులో ప్రారంభమైన డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన 19 బృందాలు
- ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైతే దరఖాస్తులో ఇచ్చిన ఆప్షనే అంతిమం
- పోస్టుల ఎంపికకు ఇప్పుడు అవకాశం లేక ఆందోళన చెందుతున్న అభ్యర్థులు
- ప్రభుత్వ నిర్ణయం మేరకే పోస్టింగ్ అంటున్న జిల్లా స్థాయి అధికారులు

డీఎస్సీ –2025లో ప్రతిభ చాటిన అభ్యర్థులు కూటమి సర్కార్ తీరుతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం ఏళ్ల తరబడి శ్రమించి, పరీక్షలు రాసిన వారు పోస్టింగు ఆర్డర్లు అందుకోవడం గగనంగా మారింది. కష్టపడి చదివి, పరీక్షలు రాసి మెరిట్‌లో ఉన్నప్పటికీ విద్యాశాఖ నుంచి కాల్ లెటర్ పంపితేనే ఉద్యోగం అంటూ ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధనలతో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.



సర్టిఫికెట్ల పరిశీలన తీరును తెలుసుకుంటున్న డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తం

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 నోటిఫికేషన్ ఆధారంగా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్, సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్ తదితర పోస్టులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులను సాధించి, పోస్టు ఖాయం అనుకున్న అభ్యర్థులు సైతం విద్యాశాఖ విధించిన నిబంధనలతో అయోమయంలో పడ్డారు. పోస్టింగ్ వస్తుందా, లేదా అనే సందేహాలతో సతమతం అవుతున్నారు. కాల్ లెటర్ వస్తేనే ఉద్యోగం, లేకుంటే కొలువు గల్లంతే అనే విధంగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది.

19 బృందాలతో పరిశీలన

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో చేపట్టారు. మొత్తం 1,143 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో చూపించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 19 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు కళాశాలలోని ఆడిటోరియంతోపాటు వేర్వేరు గదుల్లో 50 మంది చొప్పున అభ్యర్థులను కేటాయించారు. పాఠశాల విద్యాశాఖ నుంచి కాల్ లెటర్ అందుకున్న అభ్యర్థుల వారీగా డీఎస్సీ సైట్‌లో సర్టిఫికెట్లను విజయవంతంగా అప్‌లోడ్ చేసుకున్న వారినే వెరిఫికేషన్‌కు పిలిచారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తం పర్యవేక్షణలో టీమ్‌ల వారీగా నియమించిన అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. పరిశీలకురాలిగా కమిషనరేట్ నుంచి పి.శైలజ హాజరు కాగా, డీఆర్వో ఖాజావలి వెరిఫికేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

జాబితా ప్రకటనేదీ?

పాఠశాల విద్యాశాఖ నుంచి కాల్ లెటర్ పొందిన అభ్యర్థులకే పోస్టింగ్ అని, లేదంటే పోస్టింగ్ రాదనే కోణంలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ మారిపోయింది. పోస్టులకు మెరిట్ కం రోస్టర్ ప్రకారం జాబితాను బహిరంగంగా ప్రదర్శించినట్లయితే అభ్యర్థులు ఎవరికి వారు తమకు వచ్చిన మార్కులు, రిజర్వేషన్ కేటగిరీ, మెరిట్‌లో తమ కంటే ఎంత మంది ముందు ఉన్నారనే సాధారణమైన సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉండేది. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు అయ్యారు. మరికొంత మంది కాల్ లెటర్లు రాకపోవడానికి కారణాలు తెలుసుకునేందుకు వచ్చారు. ప్రతి పోస్టుకు మెరిట్ ప్రకారం ఇద్దరేసి అభ్యర్థులను ఎంపిక చేసిన అధికారులు... వెరిఫికేషన్ సెంటర్‌కు వచ్చిన వారి సర్టిఫికెట్లను పరిశీలన జరిపారు. 19 టీమ్‌ల వారీగా 930 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం రాత్రికి పూర్తి చేసేందుకు నిర్ణయించారు. మిగిలిన వారి సర్టిఫికెట్లను శుక్రవారం పరిశీలన చేయనున్నారు.

ఘనపతి.. నమోస్తుతే..



గుంటూరు నగరంలో వినాయక చవితి వేడుకలు అంబరాన్ని అంటాయి. రెడ్డిపాలెంలో విశేషంగా ఆకట్టుకుంటున్న 99 అడుగుల ఎత్తైన లంబోదరుడికి ఘనంగా పూజలు చేస్తున్నారు. గురువారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని కనులారా దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి

గుంటూరు లీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌ల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌పై వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన చర్చించారు. ఎక్కువ సంఖ్యలో క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. దీనికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్య నారాయణలు స్టేక్ హోల్డర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

బాల్య వివాహాలతో చేటు

బాల్య వివాహాలు, గిరిజన మహిళలలో ఎర్లీ ప్రెగ్నన్సీపై జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గురువారం గుంటూరు సుగాలికాలనీ విద్యానగర్‌లో సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టపరంగా నేరమని తెలిపారు. త్వరగా పెళ్లి చేస్తే బాలికలకు మానసిక, శారీరకంగా పలు రకాల ఇబ్బందులు కూడా తలెత్తుతాయని గుర్తుచేశారు. తగిన వయస్సు వచ్చేవరకు వారు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఇక గిరిజనుల్లో ఎర్లీ ప్రెగ్నన్సీకి చదువుకోక పోవడమే ప్రధాన కారణమని గుర్తుచేశారు. అక్షరాస్యత పెంచి వారిని చదువుల బాట పట్టిస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల లూటీపై కౌన్సిల్‌లో గరం గరం

- ఇంజినీరింగ్ సెక్షన్‌లో అవకతవకలపై 'సాక్షి' కథనంతో ప్రకంపనలు
- ఇవే అంశాలను ప్రస్తావించిన టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి, కార్పొరేటర్ శ్రీరామ్ ప్రసాద్
- ఒకే కాంట్రాక్టర్‌కు పదుల సంఖ్యలో వర్కుల కేటాయింపుపై నిలదీత



కమిషనర్‌ను నిలదీస్తున్న టీడీపీ ఎమ్మెల్యే మాధవి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియలో అవకతవకలపై ఈ నెల 22వ తేదీన 'రూ.కోట్లలో తమ్ముళ్ల లూటీ!' అంటూ 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనం కౌన్సిల్‌లో ప్రకంపనలు సృష్టించింది. ఈ అంశంపై తెలుగుదేశం సభ్యులే మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి, టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ ఈ అంశాలను చర్చకు తీసుకువచ్చారు. అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లపైనే పశ్చిమ ఎమ్మెల్యే, కార్పొరేటర్ విరుచుకుపడటంపై చర్చనీయాంశంగా మారింది.

అడ్డగోలుగా కేటాయిస్తారా?

నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో కేటాయింపులు ఎలా జరుగుతున్నాయి? ఒకరికే పదుల సంఖ్యలో టెండర్లు ఏ విధంగా కేటాయిస్తున్నారు? వంటి వాటిపై సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని ఆరోపించారు. అర్హత లేని కాంట్రాక్టర్లకు వర్కులు కేటాయించడం ద్వారా పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. గత సంవత్సర కాలంలో రూ.వందల కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. అయినప్పటికీ పనులు చేయని కాంట్రాక్టర్లకే టెండర్లు రావడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ కాంట్రాక్టర్‌కు ఎన్ని వర్కులు కేటాయించారు? ఏ స్టేజ్‌లో ఉన్నాయి? వంటి వివరాలు తనకు అందజేయాలన్నారు.

నాణ్యతకు తిలోదకాలిస్తే ఎలా?

టెండర్ ప్రక్రియలో 30 నుంచి 40 శాతం వరకు కొందరు లెస్సులు వేస్తున్నారని, అదీ జీఎస్టీతో కలిపి ఇలా వేయడం ద్వారా నాణ్యత ఏముంటుందని టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. అర్హత లేని వారికి టెండర్లు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. టెండర్ రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన వారు కూడా పాల్గొంటూ వర్కులు చేసుకుంటూ బిల్లులు కూడా ప్రాసెస్ చేసుకున్నారని 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా కీర్తి చేకూరి ఉన్నప్పుడు ఇంజినీరింగ్ సెక్షన్‌లో అవకతవకలకు పాల్పడే టెక్నికల్ అసిస్టెంట్లను తొలగించారని గుర్తుచేశారు. తిరిగి వారికి అక్కడే ఏ విధంగా విధులు కేటాయిస్తారంటూ నిలదీశారు. స్పందించిన ఇన్‌చార్జి ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి మాట్లాడుతూ... వర్కులు చేయకుండా పెండింగ్‌లో పెట్టిన వారి 72 వర్కులను క్యాన్సిల్ చేయడం జరిగిందన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో టెక్నికల్ అసిస్టెంట్ల స్థానంలో వార్డు ఎమినిటీ సెక్రటరీలను విధుల్లోకి తీసుకున్నామన్నారు. మొత్తానికి 'సాక్షి' కథనం కౌన్సిల్‌లో ప్రకంపనలు సృష్టించింది.

కూటమి ఆటలో అంతా ఓటమి

అధికారంలోకి వచ్చాక క్రీడాకారుల గురించే పట్టించుకోని ప్రభుత్వం

- స్టేడియాల నిర్మాణం, శిక్షకుల నియామకంపై నిర్లక్ష్యం
- అంతర్జాతీయ క్రీడాకారులకు పుట్టినిల్లు గుంటూరు జిల్లా
- శ్రద్ధ కొరవడటంతో ఔత్సాహిక క్రీడాకారుల్లో అయోమయం
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడారంగంతోనే ఆటలాడుతోంది. హాకీకి పర్యాయ పదమైన ధ్యాన్‌చంద్ జన్మదినం ఆగస్టు 29వ తేదీని కేంద్ర ప్రభుత్వం ఏటా 'జాతీయ క్రీడా దినోత్సవం'గా నిర్వహించడం ఆనవాయితీ. జిల్లా క్రీడారంగానికి గట్టి పునాదే ఉంది. ప్రపంచ మాజీ నెంబర్ వన్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, శ్యామ్ సుందర్ (అర్జున అవార్డు గ్రహీత), రమణారావు(ద్రోణాచార్య, అర్జున అవార్డుల గ్రహీత), సత్తె గీత (ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత) ఇక్కడి వారే. ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించడమే కాకుండా బీసీసీఐ చీఫ్ సెలక్టర్‌గానూ వ్యవహరించారు. నిశ్శంకరరావు రవికుమార్ అంతర్జాతీయ బాడీ బిల్డర్‌గా రాణిస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నాడు–నేడు' పథకంలో పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి ఎంతో కృషి చేసి, పలు వసతులు కల్పించారు.

'క్రీడా పాలసీ' కనుమరుగు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిర్లక్ష్యానికి గురైన అనేక అంశాల్లో క్రీడా రంగం ఒకటి. హాకీకి జిల్లాలో కనీసం స్టేడియం లేదు. 2 ఎకరాలిస్తే తీర్చిదిద్దుతామని సీనియర్లు వేడుకున్నా దిక్కులేదు. జిల్లాలో సుమారు 30 మంది కోచ్‌లున్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో నెట్టుకొస్తున్నారు. మైదానాల మరమ్మతులు కూడా అంతంత మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మొక్కుబడిగా మారాయి.

పచ్చ నేతల గొడవతో ఎన్నికలు రద్దు

ఇటీవల స్థానిక ఎన్టీఆర్ స్టేడియానికి సంబంధించి నూతన కమిటీ ఎన్నికలు టీడీపీలోని రెండు వర్గాల వైరంతో రద్దయ్యాయి. బీఆర్ స్టేడియాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పిన నాయకులు తీసుకున్న చర్యలు శూన్యం మరమ్మతులకే దిక్కు లేదు. దీనిపై వాకర్స్ అసోసియేషన్ వారు కూడా ధర్నా చేశారు. సుమారు 26 ఎకరాల్లోని ఈ మైదానంలో పలు క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు. కోచ్‌లు ఉన్నారు. వసతులు మెరుగుపరిస్తే మంచి క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. మరిన్ని క్రీడా మైదానాల అవసరం కూడా ఉంది.

క్రీడా సంఘాల అశ్రద్ధ

జిల్లాలో మొత్తం 40 క్రీడా సంఘాలున్నాయి. వీటిలో కొన్ని క్రీడలకే పోటీలు నిర్వహిస్తున్నారు. చాలా క్రీడా సంఘాల వ్యవహారాలు కోర్టుల్లోనే ఉన్నాయి. ఇటీవల క్రీడా కోటాలో నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన కొందరి వ్యవహారం వెలుగుచూసింది. ఇక్కడా రాజకీయ నాయకుల జోక్యం పెరిగింది.

ఉద్యోగాలు కల్పించాలి



యువతను ప్రోత్సహించడానికి జాతీయ పతకాలు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి. 3 శాతం ఉన్న క్రీడా కోటా ఇంకా పెంచాలి. బీఆర్ స్టేడియంలో ఉండే వెయిట్ లిఫ్టింగ్ విభాగం తీసేయడం దారుణం. ప్రశ్నించేవారు కూడా లేరు.

– కె.విజయ భాస్కరరావు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

తల్లిదండ్రుల వైఖరి మారాలి



చాలా ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. ఇక క్రీడాకారులు ఎక్కడి నుంచి వస్తారు? గంటసేపైనా క్రీడా సాధన చేయించాలి. మండలానికొక క్రీడా మైదానం అవసరం. నిపుణులతో కమిటీలు వేసి చర్చించాలి.

– షేక్ అబ్దుల్ జలీల్, ఏపీ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సదుపాయాలు మెరుగుపడాలి



క్రీడా సాధనకు తగిన సామగ్రి, పరికరాలు సమకూర్చాలి. హాకీకి నగరంలో మైదానం కూడా లేకపోవడం దురదృష్టకరం. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. క్రీడలకు బడ్జెట్‌లో కేటాయింపుల వివరాలూ లేవు.

– చల్లా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు

డబ్బుకు కక్కుర్తిపడి షిఫ్ట్ ఆపరేటర్ల తొలగింపు

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



బాధితులతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: డబ్బుకు కక్కుర్తిపడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న నలుగురిని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఈ నెల 21 నుంచి మౌఖిక ఆదేశాలతో తొలగించడంతో వారు గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళాలు వేసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వారికి వైఎస్సార్ సీపీ సంఘీభావం తెలిపింది. మాజీ మంత్రి రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాను సత్తెనపల్లి శాసనసభ్యుడిగా, మంత్రిగా కొనసాగిన సమయంలో 34 మంది షిఫ్ట్ ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. తెలుగుదేశం శాసనసభ్యుడు నియమించిన ఏ ఒక్క షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగించలేదన్నారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇస్తే వాళ్లను తీసుకువచ్చి కొత్తగా ఇక్కడ వేస్తారన్నారు. 19 మందిని తొలగించారని, అంటే ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు చొప్పున రూ.95 లక్షలు బేరం పెట్టుకున్నారని, స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను ఈ మొత్తం తీసుకున్నారా? లేదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ చిరు ఉద్యోగుల పొట్ట కొట్టవద్దన్నారు. 2023లో నియమితులైన నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించడం, కనీసం నోటీసు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బాధితుల బంధువులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో వరద ఉధృతి

- క్రమేపీ పెరుగుతున్న నీటిమట్టం
- పొంగి ప్రవహిస్తున్న పెదమద్దూరు వాగు



ధ్యానబుద్ధ ఘాట్ వద్ద ఉధృతంగా కృష్ణమ్మ

అమరావతి: ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి బుధవారం రాత్రి సుమారు 3 లక్షల క్యూసెక్కులకుపైగా విడుదల చేయటంతో కృష్ణా నదిలో వరద పెరుగుతోంది. గురువారం ఉదయం నుంచి అమరావతిలో నది నీటిమట్టం గంటగంటకూ పెరగడంతో లోతట్టు పొలాలలో వరద చేరుతోంది. మండల పరిధిలోని పెదమద్దూరు, మునగోడు, అమరావతి, ధరణికోట, మల్లాది, దిడుగు గ్రామాలలో పంటలు నీట మునిగేలా ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు నది పరివాహక ప్రాంత గ్రామాలలో పంట పొలాలు నీట మనిగాయి. మళ్లీ అదే పరిస్థితి వస్తుండటంతో రైతులకు తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదం ఉంది. పెద మద్దూరు వాగుపై లోలెవల్ చప్టా పూర్తిగా నీట మునిగింది. చప్టాపై మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. విజయవాడ – అమరావతిలకు రాకపోకల నిలిచిపోయాయి. అధికారులు లోతట్టు ప్రాంతాలలో ఉన్న వారిని మళ్లీ అప్రమత్తం చేస్తున్నారు.



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 13

కొమ్ములు : 9 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,400	10,400	10,400

కాయలు : 4 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
7,000	10,400	10,400

మొత్తం అమ్మకాలు : 9.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల




గౌతమినగర్‌లో..



కొరిటెపాడులో..



అంబేద్కర్‌నగర్‌లో..



శ్రీనగర్‌లో..



ముత్యాలరెడ్డినగర్‌లో..



సాకేత్‌పురంలో...

వినాయకా.. పూజలన్నీ నీకే ఇక..!

వినాయక చవితి వేడుకలు గుంటూరు నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంటే కాకుండా వీధి వీధినా గణపతిని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఇక ఇళ్లల్లో, బహుళ అంతస్తుల భవనాల ఆవరణలో గణపతి ప్రతిమలను ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. విశేష అలంకరణలు చేశారు. చిన్నారులు, యువత, మహిళలు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొంటున్నారు. గురువారం నగరంలోని వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	45,242
అమ్మకాలు	46,264
నిల్వ	10,315

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు–5	10,000–13,500
341	10,000–15,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,000
నంబరు–5	10,000–13,600
341	11,000–15,500
4884	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,200
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్	10,000 – 13,800
తాలుకాయలు	6,000 – 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,400
సంగీ బాడిగ 5531	10,000 – 14,000
తాలు	5,400 – 7,200

-కొరిటెపాడు (గుంటూరు)

రేపటి నుంచి రాష్ట్ర ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ 2వ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్ ఈ నెల 30, 31వ తేదీల్లో ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ సంఘం పర్యవేక్షణలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్‌లో పురుషులకు, మహిళలకు వేరుగా పోటీలు ఉంటాయని చెప్పారు. దాదాపు 150 మంది పాల్గొంటారని, వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిభావంతులైన ఆరుగురిని ఏపీ స్టేట్ క్యారమ్స్ జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. 10 మంది రిఫరీలుగా వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులకు ట్రోఫీతోపాటు రూ.30 వేలు నగదు అందజేస్తామని పేర్కొన్నారు.

నగదు రహిత వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

లక్ష్మీపురం: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్‌ఎస్ పేషెంట్లకు నగదు రహిత వైద్యం అందేలా అన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో డీఆర్‌సీ సమావేశ మందిరంలో గురువారం డిసిప్లినరీ కమిటీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 87 ఫిర్యాదులపై విచారణ జరిపి వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆసుపత్రుల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పేషెంట్లకు నగదు రహిత వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈహెచ్‌ఎస్ కింద ఉద్యోగులు, పెన్షనర్స్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు వచ్చినప్పుడు వైద్య సేవలు తిరస్కరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యసేవలు పొందే రోగులకు మందులు, పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి అనుసంధానమైన సెంటర్లకు మాత్రమే పంపించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పదవుల నియామకం



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాడికొండ నియోజకవర్గానికి చెందిన సయ్యద్ హబీబుల్లాను పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, పార్టీ వలంటీర్స్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షేక్ నాసర్‌వలీ, కల్చరల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తమనంపల్లి శాంతయ్య, గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మైనారిటీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షేక్ అఫ్సర్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం కార్యదర్శిగా మద్దు ప్రేమజ్యోతిబాబు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ పి.ముత్యంను క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాసులురెడ్డికి పదోన్నతి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులురెడ్డికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చి విజయవాడ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం గుర్రంకొండ గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి 1986లో చిత్తూరులో ఏపీఎస్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధుల్లో చేరి, ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. అనంతరం డెప్యూటీ సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది తిరుపతి బదిలీ అయ్యారు. 1996లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఏపీఎస్‌ఆర్టీసీలో పదోన్నతి వచ్చింది. ఏపీపీఎస్ ద్వారా గ్రూప్–1 రాసి, 1998లో ప్రమోషన్ పొంది తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఓగా విధుల్లో చేరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా 2001లో పదోన్నతి పొంది, హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డెప్యూటీ డైరెక్టర్‌గా 2005లో ప్రమోషన్ పొంది, హైదరాబాద్ ఆర్డీ కార్యాలయానికి వెళ్లారు. మూడేళ్లుగా గుంటూరులో మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో డీడీగా పనిచేస్తున్నారు. జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన శ్రీనివాసులురెడ్డికి రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు సత్యం, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు, పలువురు వైద్యులు, అధికారులు అభినందనలు తెలిపారు.

డీడీగా పాల్ సుధాకర్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ బి.పాల్‌సుధాకర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాల్ సుధాకర్ గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డెప్యూటీ డైరెక్టర్‌గా పాల్ సుధాకర్ పదోన్నతి పొందారు. గుంటూరు ఆర్డీ కార్యాలయం డీడీగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి జాయింట్ డైరెక్టర్ విజయవాడ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో తక్షణ ఇన్‌చార్జిగా పాల్ సుధాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: మాదక ద్రవ్యాలు, మహిళలపై నేరాలకు సంబంధించి కేసుల్లో పెండింగ్‌లోని నాన్ బెయిల్‌బుల్ వారెంట్లను అమలు చేయాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణంలోని హాల్‌లో జూలై నెలకు సంబంధించి నేర సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాలో నమోదైన పలు నేరాలపై సమగ్రంగా సమీక్ష చేపట్టారు. దర్యాప్తు, నేర నియంత్రణ చర్యలపై పోలీస్ అధికారులకు ముఖ్య సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. నాన్ బెయిల్‌బుల్ వారెంట్లను వెంటనే అమలు చేయాలని చెప్పారు. చిన్నారులు, మహిళల అదృశ్యాల కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. హత్యలు, అత్యాచారాలు, ఆస్తి సంబంధిత నేరాల కేసుల్లో దర్యాప్తును ప్రాధాన్యంగా తీసుకుని చార్జిషీట్‌లు దాఖలు చేయాలని ఆదేశించారు. వైట్ కాలర్ మోసాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. నేర నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), రవికుమార్ (ఎల్‌ఓ), డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం పేరిట రూ.16 లక్షల మేరకు మోసం

లక్ష్మీపురం: ప్రభుత్వ టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి రూ.16 లక్షలు తీసుకుని మోసం చేసిన వారిపై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం, నెక్కలం గ్రామానికి చెందిన నల్లమోదు డేవిడ్‌పాల్ డీఎస్సీ 2008లో ప్రభుత్వ ఉద్యోగం పొందలేకపోయారు. ప్రైవేట్ టీచర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆగిరిపల్లి ప్రాంతానికి చెందిన కేసన అనుజ్ఞ, కేసన జానకిరామ్, గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన కేసన జ్యోతి అనే మహిళతో పరిచయం ఏర్పడింది. మంత్రులతో పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని వీరు మాయమాటలు చెప్పి నల్లమోతు డేవిడ్‌పాల్‌ను నమ్మించి రూ.16 లక్షలు తీసుకున్నారు. గురువారం బాధితుడు ఫిర్యాదు చేశారు.

గంజాయి వినియోగిస్తున్న ఐదుగురి అరెస్ట్

1.15 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: త్రీ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి వినియోగిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్.రమేష్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.... బాలాజీరావుపేటలో డాక్టర్ మస్తానమ్మకు చెందిన ఖాళీ స్థలంలో కొందరు గంజాయి వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఘటనా స్థలంలో మహేంద్రదేవ్ కాలనీకి చెందిన పాలడుగు బాలకృష్ణ, గంగానమ్మపేటకు చెందిన సయ్యద్ ముజాయిద్, వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన పోతార్లంక కార్తీక్, బాలాజీరావుపేటకు చెందిన యలవర్తి శివకుమార్, చెంచుపేటకు చెందిన షేక్ సమీర్ హుస్సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాలడుగు బాలకృష్ణ, సయ్యద్ ముజాయిద్ ఒడిశా నుంచి గంజాయి తెచ్చి మిగిలిన నిందితులతో కలిసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. గంజాయికి బానిసలైనట్లు తెలిస్తే తల్లిదండ్రులు వెంటనే పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకొస్తే కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే రిహాబిలిటేషన్ సెంటర్‌లకు పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు

దుగ్గిరాలలో 58.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 58.6 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 15.2 మి.మీ. కురిసింది. సగటు 40.6 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. పెదకాకాని మండలంలో 57 మి.మీ., చేబ్రోలు 48.4, ప్రత్తిపాడు 48.2, గుంటూరు పశ్చిమ 46.2, తాడేపల్లి 45.6, ఫిరంగిపురం 43.8, కొల్లిపర 43.2, తుళ్ళూరు 40, కాకుమాను 39.4, మంగళగిరి 39.2, గుంటూరు తూర్పు 38.6, తాడికొండ 38.6, పెదనందిపాడు 36.8, తెనాలి 35.8, వట్టిచెరుకూరు 34.4, పొన్నూరు మండలంలో 22.6 మి.మీ. చొప్పున పడింది. ఆగస్టు 28వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 148.8 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 276.8 మి.మీ. నమోదైంది.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో గందరగోళం

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గందరగోళంగా మారిందని ఏపీటీఎఫ్ (1938) గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ అభ్యర్థులు చాలామంది తమకు ఎటువంటి మెసేజెస్ రాలేదని చెప్పారన్నారు. అసలు ఏ కేటగిరీ వారికి ఎంత కటాఫ్ అనేది ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, దాని ప్రకారం వెరిఫికేషన్‌కు అభ్యర్థులను పిలిస్తే ఎవరికి ఎటువంటి అనుమానం, ఇబ్బంది ఉండదన్నారు. మెసేజెస్ వచ్చిన వారే వెరిఫికేషన్‌కు రావాలని ప్రభుత్వం చెప్పడం రిజర్వేషన్ అభ్యర్థులుకు అనేక అనుమానాలు కలిగి ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ గందరగోళానికి తెర దించాలని డిమాండ్ చేశారు. ఒక అభ్యర్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ పోస్టులకు సెలెక్ట్ అయితే నచ్చిన పోస్టు సెలెక్ట్ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వినాయక విగ్రహాల తరలింపులో ఘర్షణ

గొడవర్రు (చేబ్రోలు): వినాయక చవితి సందర్భంగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన వివాదంతో ఉద్రిక్తత ఏర్పడింది. గ్రామానికి చెందిన వారు గుంటూరులో భారీ వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసుకొని ట్రాక్టర్‌లో తీసుకువస్తున్నారు. అదే సమయంలో మరో సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఊరేగింపుగా గ్రామానికి విగ్రహాన్ని తెస్తున్నారు. దారి ఇచ్చే విషయంలో వివాదం రేగింది. ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణ పడటంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఇరువర్గాల వారు అధికార పార్టీకి చెందిన వారు కావటంతో పోలీసులపై నాయకులు ఒత్తిడి తీసుకువచ్చారు. సుమారు 19 మందిని పోలీసు స్టేషన్‌లో ముందు జాగ్రత్తగా బైండోవర్ కేసులు నమోదు చేసి పంపించివేశారు. తెనాలి డీఎస్పీ జనార్దనరావు, పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావులు గ్రామంలో పర్యటించి, ఇరువర్గాలను హెచ్చరించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో గురువారం పోలీసులు వారిని సమావేశ పరిచి, వేర్వేరు రోజుల్లో నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలని ఆదేశించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారంలో

PRISM PHARMA INDIA PVT.LTD
Medical Representatives for GUNTUR
All India operating Pharma Company, wanted Medical Representatives in any Graduates Age below-35. Minimum experience 1 year. Salary 25,000/- and Allowances 10,000/- on confirmation. Interested career mind candidates Call for interview R M - 9790967033.

WANTED
మా సంస్థ నిర్వహించు తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షలను మీ జిల్లాలో నిర్వహించుటకు ఆసక్తి కలిగిన తెలుగు, హిందీ ఉపాధ్యాయులు లేదా స్త్రీ, పురుష అభ్యర్థులు కావలెను.
Salary: 10,000/- +T.A, D.A
మన సంస్కృతి
Cell: 73960 49947

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE
■ మెగా అవకాశం ఫామ్‌ల్యాండ్ ఎకరం తీసుకున్న వారికి గజం 799/- మాత్రమే. 5 నుండి 60వ సంవత్సరం వరకు ఏటా 10 నుండి 15లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. Ph.9133574455

PLOT FOR SALE
■ గుంటూరు Ch పేట హైవేలో 100 పడకల ESI హాస్పిటల్ నిర్మించబడుతున్న వినకొండ్రుపాడు నడింపాలెం దగ్గర ఓపెన్ ప్లాట్స్ అమ్మకం. 20% పండుగ Discount ✆8331095126, 9100752099

SERVICES

BUSINESS OFFER
■ We are Ready to Invest to Develop Your Business. We also Welcome Agent., Good Commission for Agents call 90926 92403

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

MARRIAGE SERVICES
■ క్రిస్టియన్/MBA, MA, BED/టీచర్ /5.10, వయస్సు 29, 2స్టేర్ బిల్డింగ్ కోటి ఆస్తి గల వరునికి B.Sc మాథ్స్ / సైన్స్ టీచర్ వధువు కావలెను. సంప్ర॥ 8374920642, 9701485097

WANTED
■ తెనాలిలోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు అనుభవం గల సూపర్‌వైజర్ కావలెను. (M) ఆకర్షణీయమైన జీతం. ఫోన్ 86869 35606
■ మంగళగిరి, తెనాలి ఏరియాలో పురుషులు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ: డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383
■ తెనాలిలోని శ్రీను డిజిటల్స్‌లో తెలుగు టైపింగ్ & ఫొటోషాప్‌లో అనుభవం గల యువతి, యువకులు కావలెను. మంచి జీతం: 9393648484
■ కమ్మజన సేవాసమితి గుంటూరులోని వసతి గృహంలో కంప్యూటర్ DTP తెలుగు, ఇంగ్లీషు అనుభవం కల్గిన మహిళ అభ్యర్థి కావలెను. ✆ 95733 82906

బహిరంగ ప్రకటన
పాస్‌పోర్ట్ పోయినది
కిరణ్ కుమార్ చింతక్రింద, తండ్రి పేరు గోవింద రాజు, డోర్ నం. 9-59, పద్మశాలి వీధి, కేశనకుర్రుపాలెం, ఐ.పోలవరం (మం.), కోనసీమ జిల్లా వాస్తవ్యుడైన నేను దిగువ వివరాలు కలిగిన నా యొక్క భారతీయ పాస్‌పోర్టును పోగొట్టుకున్నాను :
పాస్‌పోర్ట్ నంబరు : Z6258824
ఫైల్ నంబరు : HY2063653290921
జారీ చేసిన కార్యాలయం : రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాలయం, అమీర్‌పేట్, హైదరాబాద్
పాస్‌పోర్ట్ మరలా జారీ చేయుట కొరకు దరఖాస్తు చేయుటకు చాంధనప్రాయ అవసరంగా ఈ ప్రకటన జారీచేస్తున్నాను. ఎవరికైనా నా పాస్‌పోర్ట్ దొరికినట్లయితే దిగువ సంతకందారుకు అందజేయవలసిందిగా లేదా సమీప పోలీస్ స్టేషన్ / పాస్‌పోర్ట్ అథారిటీకి తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.
కిరణ్ కుమార్ చింతక్రింద
పూర్తి చిరునామా : డోర్ నం. 9-59, పద్మశాలి వీధి, కేశనకుర్రుపాలెం, ఐ.పోలవరం (మం.), కోనసీమ జిల్లా, మొబైల్ : 7386950794.

■ మా ఆఫీస్ నందు పనిచేయుటకు ఈ దిగువ సిబ్బంది కావలెను. ఆఫీస్ మేనేజర్స్, అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ & ఆఫీస్ బాయ్స్ గుంటూరు సిటీ లో స్థిర నివాసం కలిగిన వారు ✆ 9394107300
■ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా Software Courses, Softskills & spoken English లలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం. Training కాలంలో అభ్యర్థులకు ఉచితంగా భోజనం & వసతి సౌకర్యాలు. ✆85200 55679
■ ప్రముఖ లూబ్రికెంట్స్ కంపెనీకి ఆంధ్రలోని అన్నిజిల్లాలలో ఆటో మొబైల్ సేల్స్ లో అనుభవంగల Employees & లేడీ ఆఫీస్ స్టాఫ్ కావలెను జీ.9k-30k.సె.7672004123

ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, విజయవాడ – 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922

ఇ-వేలం అమ్మకం ప్రకటన